క్లుప్తంగా

విపక్షాలు ఆరోపణలు మానుకోవాలి


చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల సాధన కోసం మాత్రమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారని, దీనిపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంతో చర్చల ద్వారా ఈ మధ్యకాలంలో రూ.22 వేల కోట్లకు పైగా నిధులు విడుదల కావడానికి మార్గం సుగమమైందన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ఎన్నో సార్లు ప్రత్యేక విమానాల్లో ఢిల్లీ టూర్లు వెళ్లి సాధించిందేమిటో ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. అమరావతిలోని సీఆర్‌డీఏ జోన్- 5లో వేలాది ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదాన్ని ఢిల్లీ వెళ్లి సీఎం జగన్ సాధించారన్నారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ పక్షోత్సవాలలో భాగంగా బుధవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రెడ్ ఎఫ్ఎమ్ 93.5 రేడియో ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం, జంతువులు, సామాన్య ప్రజలకు జరిగే దుష్పరిణామాల గురించి వివరించారు. గెయిల్ ఆఫీస్ సమీపంలో వాహనాలకు ఉచిత పొల్యూషన్ చెకప్ చేసి సర్టిఫికెట్‌లను అందజేశారు. వివిధ గ్రామాలలోని సామాన్య ప్రజలతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించడం, మహిళలకు శానిటరీ బ్యాగ్‌ల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు.

నందనవనం.. ఎన్నికల సమరం

- నర్సరీ ఎన్నికలకు సన్నాహాలు
- ఈ నెల 16న నిర్వహణకు ఏర్పాట్లు



కడియపులంకలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయం

కడియం: నందన వనాల్లో ఎన్నికల వేడి మొదలైంది.. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలకవర్గ ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. దీనికి సంబంధించిన ప్రధాన కార్యాలయం కడియపులంకలో ఉంది. ఈ అసోసియేషన్ పరిధిలో సుమారు 1,836 మంది నర్సరీ రైతులు సభ్యులుగా ఉన్నారు. ఈ అసోసియేషన్ దేశంలోనే అతి పెద్ద నర్సరీ అసోసియేషన్‌గా పేరొంది. ఈ ఎన్నికలకు సహకరించాలని కోరుతూ సంబంధిత నర్సరీ రైతు ప్రతినిధులు మండల, జిల్లా స్థాయి అధికారులను కలసి వినతిపత్రాలు అందజేస్తున్నారు. అసోసియేషన్ పాలకవర్గ ఎన్నికపై జాతీయ స్థాయిలో నర్సరీ రైతుల దృష్టి ఉంటుందని రైతులు అంటున్నారు. అందుకు అనుగుణంగా ప్రతిష్టాత్మకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దల కమిటీ, వలంటరీ కమిటీ, పూర్వపు పాలకవర్గం, ప్రస్తుత పాలకవర్గ సభ్యులు ఈ ఎన్నికలకు అన్నీ సిద్ధం చేస్తున్నారు. గతంలో ఎన్నికలను కడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సారి అసోసియేషన్‌కు కడియపులంకలో సమకూర్చుకున్న శాశ్వత భవనంలోనే ఎన్నిక జరగనుంది. నర్సరీ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఉన్నప్పుడు తాడాల కొండయ్య, ఆ తరువాత తాడాల వీరాస్వామిలు అధ్యక్షులుగా పనిచేశారు. సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌గా పేరు మార్చిన తరువాత ఇప్పటి వరకూ రెండు సార్లు ఎన్నికలు జరిగాయి. రెండు పర్యాయాలూ పుల్లా ఆంజనేయులు, పుల్లా సత్యనారాయణ (అబ్బులు) పాలకవర్గాలు అసోసియేషన్ పగ్గాలు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన వీరిద్దరూ అధ్యక్షులుగా ఏర్పడిన పాలకవర్గాల హయాంలో అసోసియేషన్‌కు శాశ్వత భవనం, పలు సేవా కార్యక్రమాల నిర్వహణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

బృహత్తర బాధ్యత

ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందే పాలవకర్గంపై బృహత్తర బాధ్యత ఉంటుందని నర్సరీ రైతులు అంటున్నారు. నర్సరీ రంగంలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంలో అసోసియేషన్ కీలకపాత్ర పోషించాలని కోరుకుంటున్నారు. రైతుల సమస్యను తమ సమస్యగా భావించి పోరాడగలిగే వారు పాలకవర్గ బాధ్యతలు చేపట్టాలన్న ఆకాంక్ష సర్వత్రా వినిపిస్తోంది. నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడం, మందకొడిగా సాగుతున్న మొక్కల అమ్మకాలు, బ్యాంకులతో సమస్యలు.. ఇలా పలు సమస్యల పరిష్కారంలో అసోసియేషన్ కీలకభూమిక వహించాల్సి ఉంటుంది. అంతే కాకుండా నర్సరీల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను లాభనష్టాల్లేని పద్ధతిలో రైతులకు అసోసియేషన్ ద్వారా అందుబాటులో ఉంచాలన్న డిమాండ్ కూడా ఎప్పట్నుంచో ఉంది. రెండు సార్లు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఎన్నికలు రాజకీయాలకు అతీతంగానే జరిగాయని నర్సరీ రైతులు చెబుతున్నారు. ఈ సారి కూడా అలాగే జరగాలని ఆకాంక్షిస్తున్నారు.

బయటపడని ఆశావహులు

నర్సరీ అసోసియేషన్‌కు ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికీ ఆశావహులు ఇంకా బయటపడలేదు. ప్రస్తుత పాలకవర్గంలో కీలకంగా ఉన్న ఒకరు, కొత్త పార్టీకి చెందిన యువ నాయకుడొకరు, గత పాలకవర్గంలో పోటీలో ఉన్న వారొకరు ప్రస్తుతం పోటీకి సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాము పోటీలో ఉండబోతున్నామంటూ సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనా మరో పది రోజుల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లోనే పూర్తిస్థాయిలో ఆశావహులు వెలుగులోకొచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

9న నామినేషన్ల స్వీకరణ
11న నామినేషన్ల ఉపసంహరణ
11న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
15న ప్రచారం నిలుపుదల
16న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు పోలింగ్. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

విగ్రహావిష్కరణకు తరలిరండి

సీటీఆర్ఐ: సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ గుంటూరులో జరుగనుందని, దీనికి అంతా తరలిరావాలని గ్రేటర్ రాజమహేంద్రవరం శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మరుకుర్తి రవియాదవ్ కోరారు. బుధవారం స్థానిక దానవాయిపేటలోని శ్రీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం భవనంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రవి యాదవ్ మాట్లాడుతూ గుంటూరులో 9న జరిగే ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణకు కర్ణాటక, తమిళనాడు ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, స్టాలిన్ హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు 9వ తేదీ ఉదయం 9 గంటలకు కార్లు ఇతర వాహనాలు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో అంకం గోపి, మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ ఆత్మాహత్యాయత్నం

రాజమహేంద్రవరం రూరల్: సచివాలయ సర్వేయర్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. ఐ.వంగిడికి చెందిన గొలగాని వాసవి పిడింగొయ్యి గ్రామ సచివాలయం-4లో సర్వేయర్‌గా పనిచేస్తుంది. బుధవారం సచివాలయానికి వచ్చి వాంతులు చేసుకోవడంతో వెంటనే సహచరులు ఆమె బ్యాగును పరిశీలించారు. అందులో పురుగు మందు డబ్బా, ఎలుకల మందు ఉంది. వాసవిని సచివాలయ ఉద్యోగులు ఆరా తీయగా గోదావరి గట్టు సమీపంలో పురుగు మందు తాగినట్లు తెలిపింది. వెంటనే ఆమెను ఆటోలో నగరంలోని ఒక ఎమర్జెన్సీ ఆసుపత్రికి తరలించారు.

22న ప్రత్యేక లోక్ అదాలత్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రత్యేక లోక్ అదాలత్‌ను 22న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం తెలిపారు. దీనిపై స్థానిక డీఎల్ఎస్ఏ కార్యాలయంలో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య సమన్వయం కుదిర్చే విధంగా చర్చలు జరిపారు.

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం


శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

తనను కలసిన గూడూరితో ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసి, రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేద్దామని పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆ పార్టీ సిటీ కోఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు సూచించారు. బుధవారం ఎంపీ భరత్‌రామ్‌ను డాక్టర్ గూడూరి మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గూడూరి శ్రీనివాస్‌కు శాలువా కప్పి, జ్ఞాపికతో ఎంపీ సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధిష్టానం అన్నివిధాలా ఆలోచించి కోఆర్డినేటర్‌గా నియమించిందని, వర్గ విభేదాలకు అతీతంగా అందరినీ కలుపుకొంటూ ముందుకు సాగాలన్నారు. డాక్టర్ గూడూరి మాట్లాడుతూ తన శక్తి సామర్థ్యాలు నిరూపించుకునేందుకు ఇదో మంచి అవకాశమన్నారు. సీఎం జగన్ నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అన్నారు. కాగా శ్రీనివాస్‌ను వైఎస్సార్ సీపీ నేతలు గుర్రం గౌతమ్, పాలిక శ్రీను, నక్కాశ్రీ నగేష్, ఎస్వీ శ్రీనివాస్, మార్గాని చంటిబాబు, కడలి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

నగరంలో పార్టీ జెండా రెపరెపలాడాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: నగర నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడేలా కృషి చేయాలని పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. సిటీ కోఆర్డినేటర్‌గా నియమితులైన డాక్టర్ శ్రీనివాస్ నగరంలో జక్కంపూడి రాజాను బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. డాక్టర్ శ్రీనివాస్‌కు రాజా సాదర స్వాగతం పలికి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ప్రముఖ వైద్య నిపుణుడిగా పేరొందిన శ్రీనివాస్ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలకు సుపరిచితులన్నారు. సౌమ్యునిగా పేరొందిన ఆయన ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరింత బలపడుతుందని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనకు సహాయ సహకారాలు అందించాలని రాజాను శ్రీనివాస్ కోరారు. పార్టీ పటిష్టానికి తన పూర్తి సహకారం అందజేస్తానని రాజా హామీ ఇచ్చారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

సీటీఆర్ఐ: వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్‌గా గూడూరి శ్రీనివాస్‌కు అవకాశం ఇచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని శెట్టిబలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. బుధవారం ఆయన శ్రీనివాస్‌ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్బన్ పరిధిలో అందరి సమన్వయంతో పార్టీకి మంచి పేరు తెస్తారని ఆశిస్తున్నామన్నారు.


గూడూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ట్రస్టు సేవలు అభినందనీయం


గొందేశి పూర్ణచంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సినీనటుడు సుమన్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎంతో మంది విద్యార్థులు, పేదలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ సీపీ నేత, ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి సేవలను సినీనటుడు సుమన్ అభినందించారు. బుధవారం స్థానిక బాలాజీపేట సెంటర్‌లో స్వర్గీయ గొందేశి పూర్ణచంద్రారెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత విద్యకు శ్రీనివాసులరెడ్డి ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వడంతో పాటు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి, దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, స్వర్ణాంధ్ర చైర్మన్ పడాల రామిరెడ్డి, సూరంపూడి ప్రకాష్, చరణ్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీ పద్మ శశిధర్‌కు అభినందన


ఆర్డీ పద్మశశిధర్‌ను అభినందిస్తున్న ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జోన్-2 ఏడు జిల్లాల ప్రాంతీయ వైద్య సహాయ సంచాలకులు పద్మ శశిధర్‌ను జిల్లా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం కలుసుకున్నారు. స్థానిక ఆర్డీ కార్యాలయంలో ఆమెను అభినందించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ పీవీఎల్ సురేష్ కుమార్‌ను కలసి జీవో 143పై అసోసియేషన్ నాయకులు పేపకాయల వెంకట కృష్ణ, పసుపులేటి శ్రీనివాస్ చర్చించారు. కార్యక్రమంలో నాయకులు సరెళ్ల చంద్రరావు, కేఎస్వీ ప్రసాద్, చొల్లంగి త్రినాథ్‌కుమార్, సేవా ప్రవీణ్‌కుమార్, పి.అనిల్‌కుమార్, ఎస్వీఎస్ ప్రతాప్, మీసాల మాధవరావు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించండి

కడియం: మండలంలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఎన్నికలకు సహకరించాలని నర్సరీ రంగ ప్రముఖులు తహసీల్దార్ ఎం.సుజాత, ఎంపీడీఓ కె.రత్నకుమారితో పాటు పలువురు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయా అధికారుల కార్యాలయాల్లో కలసి ఎన్నికల షెడ్యూల్‌ను వారికి అందజేశారు. కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, తిరుమలశెట్టి భాస్కరరావు, బొర్సు సుబ్బారాయుడు, ఆకుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

కడియం: స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి శ్రమదానంతో ఇబ్బందిని పరిష్కరించారు. దుళ్ల- వీరవరం రోడ్డులో బుధవారం సాయంత్రం 4 గంటలకు భారీ వృక్షం పడిపోయింది. రోడ్డుకు అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు పడిపోవడాన్ని గుర్తించిన దుళ్ల ఎర్రకాలనీకి చెందిన యువకులు శ్రమదానం చేసి దానిని తొలగించారు.

సేవలు అభినందనీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని గేదెల నూకరాజు కల్యాణ మండపంలో బుధవారం ట్రస్ట్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి మతల రమేష్, సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిన వెంకన్నబాబు, డాక్టర్ ఎల్.నారం నాయుడు, దూలం పద్మ వెంకన్నబాబు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు చక్కని అవకాశం


పదో తరగతిలో తిరిగి చేరిన విద్యార్థికి జేవీకే కిట్ అందిస్తున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల విషయంలో మంచి నిర్ణయం తీసుకుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పిన ఆరుగురు విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్చి, వారికి జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు వెంటనే జూన్‌లో సప్లిమెంటరీ రాసి ఉత్తీర్ణులవడం తెలిసిన విషయమేనన్నారు. ఆ సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా తప్పిన విద్యార్థులు తిరిగి మార్చి వరకూ చదువుకునే అవకాశం లేదన్నారు. దీనివల్ల వారు వివిధ పనుల్లో చేరిపోతూ చదువును అశ్రద్ధ చేస్తున్నారని గమనించిన ప్రభుత్వం తిరిగి ఆ విద్యార్థులను పదవ తరగతిలో రెగ్యులర్ చేర్చుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఇది చాలా మంచి నిర్ణయం అన్నారు. ఇలా చేరిన విద్యార్థులకు ప్రభుత్వ ప్రయోజనాలన్నీ అందజేస్తారన్నారు. పాఠశాల హెచ్ఎంలు ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఎం.సరితా రంజని పాల్గొన్నారు. అనంతరం శాటిలైట్ సిటీ ఉన్నత పాఠశాల, ధవళేశ్వరం బాలుర ఉన్నత పాఠశాలలోనూ విద్యార్థులను పాఠశాలల్లో చేర్చి జేవీకే కిట్‌లు అందజేశారు.